జోహార్.. వైఎస్సార్

రామకృష్ణాపూర్: దివంగత ముఖ్యమంత్రి, సంక్షేమ సారథి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలను రామకృష్ణాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ తదితర పథకాలతో పేదల గుండెల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, రాజం, పలిగిరి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూస్‌రీల్

గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా తిరుపతి



కొట్నాక తిరుపతి

దండేపల్లి: తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం అల్లీపూర్‌కు చెందిన కొట్నాక తిరుపతి నియమితులయ్యారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ కోఆర్డినేటర్‌గా, ఆదివాసీ సేన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న తిరుపతి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రలో, భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ పాదయాత్రలో చురుగ్గా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో మంచి గుర్తింపు ఉన్న అతడిని ప్రభుత్వం రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. తనకు పదవి అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి, నాయకులకు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి తనవంతుగా కృషిచేస్తానని పేర్కొన్నారు.

కేజీబీవీలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న టీం సభ్యులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలపు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే బృంద సభ్యులు ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, ఫార్మసిస్టు వనిత, కేజీబీవీ ఏఎన్‌ఎం హేమలత, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న పాల్గొన్నారు.

పగలు ఎండ.. రాత్రి వాన



ఎండకు వెలవెలబోతున్న లక్ష్మీటాకీస్ చౌరస్తా

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. వేసవిని తలపించేలా పగలు ఎండ కొడుతుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత కొనసాగుతుంది. సాయంత్రం ఆకాశంలో మబ్బులు కమ్ముకొని జల్లులు కురుస్తున్నాయి. తెలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభమై నెలరోజులు గడిచినా ఎండల తీవ్రత తగ్గలేదు. ఎండలకు తోడు గాలిలో తేమ శాతం తక్కువగా ఉండడంతో ఉక్కపోతతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కూలర్లు, ఏసీల వినియోగం కొనసాగుతోంది. రెండు మూడు రోజులు ముసురు వర్షాలు కురిస్తే తప్ప ఈ వేడి, ఉక్కపోత తగ్గే పరిస్థితి కనిపించలేదని జిల్లావాసులు పేర్కొంటున్నారు.

సమస్యలపై ఎప్పుడైనా ఫిర్యాదు చేయొచ్చు

- విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ సరఫరా, బిల్లుల్లో హెచ్చుతగ్గులు, ప్రమాదకరమైన స్తంభాలు, వైర్లు తదితర సమస్యలపై విద్యుత్ వినియోగదారులు ఇప్పుడు ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. టీజీ ఎన్‌పీడీసీఎల్ కస్టమర్ గ్రీవెన్స్ పోర్టల్ (www.tgnpdcl.com)లో 24/7 సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి



మృతి చెందిన పశువులు

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లి పంట పొలాల్లో సోమవారం విద్యుదాఘాతంలో నాలుగు పశువులు మృతి చెందాయి. ఉదయం ఇంటి నుంచి మేత కోసం పొలాల వైపు వెళ్లిన పశువులు తిరుగు ప్రయాణంలో సూరం పోశిరెడ్డి పొలం వద్ద తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలాయి. దీంతో షాక్‌కుగురై అక్కడికక్కడే మృతి చెందాయి. వీటిలో ఎనగంటి చిన్నన్నకు చెందిన ఆవు, దూడ, ఆలం బక్కయ్యకు చెందిన ఆవు, గేడం రాములు చెందిన లేగదూడ ఉన్నాయి. ఒక్కోదాని విలువ రూ.10 వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. ప్రభుత్వం పరిహారం చెల్లించాలని వేడుకున్నారు. ఘటనా స్థలాన్ని జేఎల్ఎం ఉదయ్‌కుమార్ పరిశీలించారు.

దారితప్పిన గురువులు..!?



- స్పౌజ్ బదిలీల్లో నిబంధనలు బేఖాతర్
- నచ్చిన పాఠశాలకు టీచర్ల బదిలీ
- అర్హత ఉన్న ఉపాధ్యాయులకు అన్యాయం
- స్పౌజ్ పాయింట్ల వివరాల సేకరణ
- తప్పని తేలితే చర్యలకు విద్యాశాఖ సన్నద్ధం

మంచిర్యాలఅర్బన్: బదిలీల్లో స్పౌజ్ పాయింట్ కోసం ఉపాధ్యాయులు దారితప్పారు. ఎవరు చూస్తారు.. ఏం చేస్తారు అనుకున్నారో ఏమో.. ఆదర్శంగా ఉండాల్సిన గురువులే అడ్డదారిలో బదిలీలకు తెరలేపారు. నిబంధనలు బేఖాతారు చేస్తూ తప్పటడుగు వేశారు. భార్య భర్తలు(స్పౌజ్ కేటగిరీ) ఒకేచోట పనిచేసేందుకు ఉద్దేశించిన వెసులుబాటు మంచిదే అయినా కొంత మంది ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేయడంపై విమర్శలు వస్తున్నాయి. స్పౌజ్ బదిలీల్లో భార్య, భర్త ఒకే మండలంలో పోస్టింగ్‌కు దరఖాస్తు చేయాల్సి ఉండగా హెచ్‌ఆర్‌ఏ అధికంగా లభించే దూరంగా ఉండే పాఠశాలలనే ఆప్షన్‌గా చూపడం చర్చనీయాంశమైంది. ఇలా తప్పుడు సమాచారంతో బదిలీ అయిన మేడ్చల్ రంగారెడ్డి, వికరాబాద్ తోపాటు పలుజిల్లాల్లోని టీచర్లపై వేటు వేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసిన టీచర్ల జాబితా సిద్ధం చేయటంతోపాటు కఠిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి సోమవారం ఆదేశాలు వచ్చాయి. ఈమేరకు స్పౌజ్ పాయింట్లను వినియోగించుకుని ఒకే మండలంలో కాకుండా దూర ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లిన స్పౌజ్ ఉపాధ్యాయుల వివరాలను విద్యాశాఖ సేకరిస్తోంది.

స్పౌజ్ పాయింట్లు ఇలా...

భార్య, భర్త ఇద్దరు పనిచేసే పాఠశాలలకు దగ్గరగా ఉండాలనే నిబంధన తెచ్చారు. అందుకు అనుగుణంగా బదిలీల్లో పాయింట్స్ ప్రత్యేకంగా కేటాయిస్తూ ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రత్యేక ప్రాధాన్యత పాయింట్లు పొందిన తర్వాత భార్యాభర్తలు ఎనిమిదేళ్లకు ఒకసారి ఎవరో ఒకరు మాత్రమే పాయింట్లను వినియోగించుకోవాలి. స్పౌజ్ పాయింట్లు తీసుకునే (భార్య/భర్త) టీచర్లు రేడియస్‌లోనే బదిలీ స్థానాన్ని ఆప్షన్‌గా ఎంచుకోవాలి. ఒకవేళ అదే మండలంలో ఖాళీ లేకపోతే పక్క మండలాలు, తర్వాత మండలాలను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకోవాలి. భర్త పనిచేసే మండలానికి భార్య స్పౌజ్ పాయింట్‌లు వినియోగించుకోవాలి. కానీ అలా కాకుండా కొందరు తమకు నచ్చిన, హెచ్‌ఆర్‌ఏ ఎక్కువ వచ్చే మండలాలకు వెళ్లేలా వెబ్ ఆప్షన్ ఇవ్వటం చర్చనీయాంశంగా మారింది.

స్పౌజ్ ఉపాధ్యాయులపై ఆరా..

ఎస్జీటీ బదిలీలు ముగిశాయి. ఆయా పాఠశాలల్లో టీచర్లు చేరిపోయారు. స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం బదిలీ అయిన స్పౌజ్ ఉపాధ్యాయుల వివరాలు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఎంత మంది ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేశారో లెక్క తీస్తున్నారు. ఈమేరకు స్పౌజ్ పాయింట్లు వినియోగించుకున్న టీచర్ల జాబితాను ఎంఈవోల నుంచి తెప్పించుకుంటున్నారు. స్పౌజ్ టీచర్లు పెట్టుకున్న ఆప్షన్ పత్రాలను పరిశీలించనున్నారు. స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలితే చర్యలు తప్పవని తెలుస్తోంది.

మచ్చుకు కొన్ని..

- హాజీపూర్ మండలంలోని ఓ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు ఎనిమిదేళ్లు పూర్తి కావటంతో బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిబంధన ప్రకారం భర్త పనిచేసే కాసిపేట మండలానికి వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలి. కానీ, స్పౌజ్ పాయింట్లు వినియోగించుకుని విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా హాజీపూర్ మండలంలోనే మరో పాఠశాలకు వెబ్ ఆప్షన్ పెట్టుకున్నారు. దీంతో బదిలీ అయి విధులు నిర్వహిస్తున్నారు.
- బెల్లంపల్లిలో పనిచేసే ఉపాధ్యాయురాలు తన భర్త తాండూర్‌కు వెళ్లకుండా చెన్నూర్ మండలంలోని ఓ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. తాండూర్ మండలంలో ఖాళీ లేకుంటే పక్కనే ఉన్న మండలాలకు కాకుండా దూర ప్రాంత మండలం ఆప్షన్ ఇవ్వడం గమనార్హం.
- ప్రధానోపాధ్యాయుల బదిలీల్లో కూడా స్పౌజ్ పాయింట్లు పక్కదారి పట్టిన విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేరాయి. మందమర్రి మండలంలో పనిచేసే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు తన భర్త పనిచేస్తున్న బెల్లంపల్లి మండలం ఆప్షన్‌గా ఎంచుకోవాలి. కానీ, సదరు హెచ్ఎం నిబంధనలకు విరుద్ధంగా మందమర్రి మండలంలోనే మరో పాఠశాల ఆప్షన్ ఎంచుకున్నారు. స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగంతో నష్టపోయిన ప్రధానోపాధ్యాయుడు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లాస్థాయి అధికారుల నుంచి ఉన్నతాధికారుల వరకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. తాజా ఆదేశాల ప్రకారం.. ఎస్జీటీ బదిలీలో స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసిన వారితోపాటు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిపై కూడా వేటు వేస్తారని తెలుస్తోంది.

ప్రైవేటు పంటలపై కదిలిన యంత్రాంగం



చెన్నూర్‌లో పట్టు పరిశ్రమ భూముల రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

- పట్టు పరిశ్రమ భూములు సర్వే చేసిన అధికారులు
- పోలీసు బందోబస్తు మధ్య కొలతలు..



భూముల హద్దులు పరిశీలిస్తున్న అధికారులు

చెన్నూర్: తెలంగాణకు తలమానికమైన పట్టు పరిశ్రమ భూములు అన్యాక్రాంతం అవుతూ పరిశ్రమ ఉనికికే ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఈ అంశంపై 'పట్టు భూముల్లో ప్రైవేట్ పంటలు' శీర్షికన పట్టు పరిశ్రమ భూములు కబ్జా అవుతున్న విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఈ కథనానికి సెరికల్చర్, రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించారు. చెన్నూర్ మండలం ఎల్లక్కపేట, చెన్నూర్ శివారులోని పట్టు పరిశ్రమ భూములను సోమవారం పరిశీలించారు. మండల సర్వేయర్ సెరికల్చర్ భూములను సర్వే చేశారు. గతంలో సెరికల్చర్, రెవెన్యూ అధికారులు నిర్వహించిన జాయింట్ సర్వే ప్రకారం హద్దులు గుర్తించామని సెరికల్చర్ ఏడీ పార్వతి రాథోడ్ తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ సిల్క్ బోర్డు సైంటిస్ట్ భగవాండ్లు, ఎస్సై వెంకటేశ్వరావు, మండల సర్వేయర్ భీమ్ రాజ్, సెరికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణంపై పునరాలోచించాలి



వినతిపత్రం ఇస్తున్న వెంకటేశ్ నేత, రఘునాథ్

మంచిర్యాలటౌన్: ఆర్మూర్ – మంచిర్యాల మధ్య నిర్మించే నాలుగు వరుసల 63 నంబర్ జాతీయ రహదారిలో భాగంగా లక్సెట్టిపేట నుంచి ముల్కల్ల వరకు ఖరారు చేసిన అలైన్‌మెంట్‌పై పునరాలోచన చేయాలని పెద్దపల్లి మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి కోరారు. ఈమేరకు ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ రజాక్‌ను సోమవారం కలిసి వినతిపత్రంను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్సెట్టిపేట నుంచి హాజీపూర్ మండలం ముల్కల్ల వరకు గోదావరి తీరం గ్రామాల ప్రజలు గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములను కోల్పోయారని తెలిపారు. దానిని దృష్టిలో పెట్టుకుని విస్తరణ పనులను చేపట్టాలని సూచించారు. లక్సెట్టిపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్య దృష్ట్యా బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరారు.

ఆర్టీసీ డీఎం బదిలీ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ బదిలీయ్యారు. కరీంనగర్‌లో అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీరింగ్ (టైర్స్) (ఏఎంఈ(టీ)గా పనిచేస్తున్న ఎస్.జనార్దన్ బదిలీపై మంచిర్యాలకు డీఎంగా వస్తున్నారు. 2022, మార్చి 30న డిపో మేనేజర్‌గా రవీంద్రనాథ్ బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లు ఆయన ఇక్కడ విధులు నిర్వహించారు.

చెత్తకు చోటేది?

- 30 ఏళ్ల మున్సిపాలిటీకి డంప్‌యార్డు కరువు
- శ్మశానవాటిక వద్ద ప్రస్తుతం డంపింగ్
- అక్కడే డంప్‌యార్డు ఏర్పాటుకు చర్యలు
- వ్యతిరేకిస్తున్న స్థానికులు



శ్మశానవాటికలో సమాధుల మధ్య పోసిన చెత్త

బెల్లంపల్లి: జిల్లాలో మూడు దశాబ్దాల చరిత్ర కలిగిన ద్వితీయశ్రేణి మున్సిపాలిటీ బెల్లంపల్లి. నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ అయి 30 ఏళ్లు దాటినా ఇప్పటికీ బల్దియాకు డంప్‌యార్డు లేదు. ఎంతమంది అధికారులు మారినా, ఎన్ని పాలకవర్గాలు మారినా పట్టణంలోని చెత్త వేసేందుకు జాగా చూపడం లేదు. మొదట పట్టణంలోని సర్వేనంబర్ 170లో ఉన్న ప్రభుత్వ స్థలంలో డంప్‌యార్డు కోసం కేటాయించారు. అయితే తర్వాత అది స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ పరిధిలోకి వెళ్లింది. తర్వాత 65 డీప్ ఏరియా – శాంతిఖని బస్తీ మధ్య ఉన్న ప్రభుత్వ స్థలంలో డంప్ యార్డు ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఆప్రాంత వాసులు వ్యతిరేకించారు. దీంతో బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామానికి వెళ్లే మార్గం శాంతిఖని గని పక్కన ఖాళీస్థలాన్ని గుర్తించారు. ఆ ప్రాంతంలోనూ డంప్ యార్డు వద్దని శాంతిఖని బస్తీ వాసులు వ్యతిరేకించారు. తాత్కాలిక ప్రాతిపదికన ప్రస్తుతం గోల్‌బంగ్లా బస్తీ, నంబర్ 2బింక్లైన్ బస్తీలను ఆనుకుని ఉన్న శ్మశానవాటికలో చెత్తను డంప్ చేస్తున్నారు. అక్కడే డంప్ యార్డు ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇక్కడి ప్రజలు కూడా డంప్‌యార్డును వ్యతిరేకిస్తున్నారు. సమాధులపై చెత్తను డంప్‌చేసి మృతుల జ్ఞాపకాలను చెరిపేస్తుండడం మరో సమస్యకు దారితీస్తోంది.

10 ఎకరాలు కేటాయింపు ...!

ప్రస్తుతం నిర్వహిస్తున్న చోట నుంచి డంప్‌యార్డు ఎత్తివేసి మరో కొత్త ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి అధికారులు స్థలాన్వేషణ చేస్తున్నట్లు చెబుతున్నారు. తాజాగా నిర్వహిస్తున్న డంప్ యార్డు కోసం రెవెన్యూ శాఖ 10 ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలుస్తుండగా, ఆ విషయాన్ని మున్సిపల్ అధికారులు బహిర్గతం చేయడం లేదు. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో అని ఆలోచిస్తున్నారు. ప్రస్తుతం తాత్కాలిక పద్ధతిలోనే శ్మశానవాటిక సమీపంలో చెత్త డంప్ చేస్తున్నామని చెబుతున్నారు. నంబర్–2 ఇంక్లైన్ బస్తీ వైపు నుంచి డంప్ యార్డుకు వెళ్లడానికి కొత్తగా రూ.20 లక్షల అంచనాతో సీసీ రోడ్డు నిర్మాణం చేయడం అనుమానాలకు తావిస్తోంది. శ్మశానవాటిక కోసమే సీసీ రోడ్డు నిర్మాణం చేసినట్లు అధికారులు ప్రకటించినా ఏదో దాచి పెడుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. వివాదం లేని, ప్రజల నుంచి వ్యతిరేకత రాని ప్రాంతాన్ని ఎంపిక చేస్తారా లేక ప్రస్తుతం నిర్వహిస్తున్న శ్మశానవాటికలోనే కొనసాగిస్తారా అనేది తేలాల్సి ఉంది.

రెండు, మూడు రోజులకోసారి సేకరణ..

ఇక బల్దియాలో చెత్తసేకరణ సరిగా జరగడం లేదు. శాంతిఖనిబస్తీ, 65 డీప్ ఏరియా, సుభాష్‌నగర్, గోల్‌బంగ్లా బస్తీ , సుబ్బారావుపల్లి, పెద్దనపల్లి, కాల్‌టెక్స్ ఏరియా, గంగారాంనగర్, గాంధీనగర్, కన్నాలబస్తీ, కొత్తబస్టాండ్ ఏరియా, రవీందర్‌నగర్, అంబేద్కర్‌నగర్, షంషీర్‌నగర్, బెల్లంపల్లిబస్తీ హన్మాన్‌బస్తీ, రాంనగర్, అశోక్‌నగర్, టేకుల బస్తీ, పాత బస్టాండ్ ఏరియా, పోస్టాఫీసు బస్తీ, బజార్ ఏరియాలో రోజూ చెత్త సేకరణ చేయడం లేదు.

బెల్లంపల్లి బల్దియా స్వరూపం..

మున్సిపల్ స్థాయి	సెకండ్ గ్రేడ్
మున్సిపల్ వార్డులు	34
మున్సిపల్ జనాభా	56,396
(2011 జనాభా లెక్కల ప్రకారం)	
పారిశుధ్య సిబ్బంది సంఖ్య	70
చెత్త తరలించే ఆటో ట్రాలీలు	24
చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్లు	05
రోజువారీగా ఉత్పత్తి అవుతున్న చెత్త	25 మెట్రిక్ టన్నులు
రోజువారీగా సేకరిస్తున్న చెత్త	22 మెట్రిక్ టన్నులు

25 మెట్రిక్ టన్నుల చెత్త

బల్దియాలో రోజుకు గరిష్టంగా 25 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. 22 మెట్రిక్ టన్నుల చెత్తను డంప్ యార్డుకు తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి అంతస్థాయిలో చెత్త డంప్‌యార్డుకు చేరడం లేదు. సగానికిపైగా చెత్త బస్తీల్లోనే రోజుల తరబడి పేరుకుపోతోందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. సరిపడా పారిశుధ్య సిబ్బంది, చెత్త తరలించే ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలు లేక పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. రోజువారీగా చెత్త సేకరించకపోవడంతో పారిశుధ్యం లోపించి వ్యాధులబారిన పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును 'సాక్షి' వివరణ కోరగా ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి చెబుతానని తెలిపారు.

గోడు వినండి.. గోస తీర్చండి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

- ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

మంచిర్యాలఅగ్రికల్చర్: పెన్షన్ మంజూరు చేయాలని ఒకరు.., భూ సమస్య పరిష్కరించాలని మరొకరు.., కరెంటు కష్టాలు తీర్చాలని ఇంకొకరు.., జీరో బిల్లు రావడం లేదని మరికొందరు.. ఇలా అనేక సమస్యలతో జిల్లా నలు మూలల నుంచి పలువురు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. తమ గోడు విని.. గోస తీర్చాలని కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు సమర్పించారు. అధికారులకు తమ బాధ చెప్పుకున్నారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 54 దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రతీ దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధితుల సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈమేరకు అర్జీదారులకు భరోసా ఇచ్చారు.

- లక్సెట్టిపేట మండలం హన్మంతుపల్లెకు చెందిన సంకోజి శంకరయ్య తనకు చందారం శివారులో భూమి ఉందని, కొంత భూమిని కొందరు అక్రమించుకున్నారని, తనకు న్యాయం చేయాలని అర్జీ అందజేశాడు.
- భీమారం మండలం పోతన్‌పల్లి గ్రామానికి చెందిన ఎడ్ల చిన్నమల్లయ్య తన భూమి ఆన్‌లైన్‌లో ఇతరుల పేరిట పట్టా చూపుతుందని, విచారణ జరిపి పట్టామర్చాలని దరఖాస్తు ఇచ్చాడు.
- మంచిర్యాల హమాలీవాడకు చెందిన ఉప్పరి సాగర్ హమాలీవాడ నుంచి తిలక్‌నగర్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని, మురుగు కాలువలు లేక, తాగునీరు అందక ఇబ్బందిపడుతున్నామని ఫిర్యాదు చేశాడు.
- బెల్లంపల్లి మండలం బూదకుర్చు గ్రామానికి చెందిన ముత్తే అపర్ణ తన భూమి ధరణిలో చూపించడం లేదని, ఆన్‌లైన్ నమోదు చేసి పట్టా పాసుపుస్తకం జారీ చేయాలని అర్జీ పెట్టుకుంది.
- హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన ఏనుగు భూపతిరెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపునకుగురైందని, మేజర్ సన్స్‌కు అందించే పరిహారం తన కుమారుడు మానసిక దివ్యాంగుడు అయిన శ్రావణ్‌కుమార్ ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నాడు.


జీరోబిల్లు రావడం లేదు..



మంచిర్యాల పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాం. గృహజ్యోతి కింద జీరో విద్యుత్ బిల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాం. కానీ వందల్లో బిల్లు వస్తుంది. విద్యుత్ అధికారులు, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదుచేసినా సమస్య పరిష్కారం కాలేదు. నంబర్ తప్పుగా నమోదు చేయడంతో ఇతరులకు జీరో బిల్లు వెళ్తున్నట్లు చెబుతున్నారు. సవరించి మాకు జీరో బిల్లు వచ్చేల చేయాలి.

– మోరి లక్ష్మి, రాజీవ్‌నగర్, మంచిర్యాల

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



తొమ్మిదేళ్లుగా పశుమిత్రులుగా పనిచేస్తున్నాం. ప్రభుత్వం ఎలాంటి వేతనం నిర్ణయించలేదు. గ్రామీణ ప్రాంతంలో రైతులకు సేవ చేస్తున్నా ప్రభుత్వం గుర్తించడం లేదు. ఇప్పటికైన ప్రభుత్వం గుర్తించి కనీస వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలి.

– వినతి పత్రం అందజేసిన వీవోఏలు

నిబంధనలు అతిక్రమించిన ఏజెన్సీపై చర్య తీసుకోవాలి..

మంచిర్యాల వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న 73 పోస్టులు స్లీపర్, సెక్యూరిటీ నిర్వహణ కోసం శ్రీమహాలక్ష్మి మ్యాన పవర్, పేస్‌మెంట్ సర్వీసెస్ ఏజెన్సీల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేశారు. ఆ ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలి. నిబంధనలు అతిక్రమించిన ఏజెన్సీపై చర్య తీసుకోవాలి.

– రంజిత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

ప్రజావాణిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి



హాజరైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి

మంచిర్యాలఅగ్రికల్చర్: కలెక్టరేట్ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హాజరయ్యారు. ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరు కావాలి. కానీ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని పంపించారు. మూడు వారాల క్రితం ప్రజావాణిలో కలెక్టర్ పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపాల్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని మందలించారు. దీంతో అప్పటి నుంచి ఆయన ప్రజావాణికి దూరంగా ఉంటున్నారు. ఇలా కిందిస్థాయి ఉద్యోగిని పంపడం చర్చనీయాంశమైంది.

కలెక్టర్ వస్తారని...



అర్జీలు ఇవ్వాలని సూచిస్తున్న కలెక్టరేట్ సిబ్బంది

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలను జిల్లా కలెక్టర్‌కు చెప్పుకుందామని సోమవారం వివిధ గ్రామాల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చారు. అయితే కలెక్టర్ ఇతర కార్యక్రమాలతో ప్రజావాణికి రాలేదు. అర్జీదారులు మాత్రం కలెక్టర్ వస్తారని సమావేశమందిరంలోనే గంటలతరబడి వేచి చూశారు. ఉదయం 10.30 గంటలకు వచ్చిన అర్జీదారులు 12 గంటల వరకు కలెక్టర్ కోసం ఎదురు చూశారు. చివరకు వారిని కలెక్టరేట్ సిబ్బంది అక్కడి నుంచి పంపించివేశారు.

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి



మృతి చెందిన గేదె

దహెగాం(సిర్పూర్): దహెగాం మండలం గెర్రె సమీపంలో పాకల శంకర్ అనే రైతుకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామ సమీపంలోని చెరువు కట్ట వద్ద మేత మేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

గుట్కా పట్టివేత

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండల కేంద్రంలోని వసాకే ప్రకాశ్‌కు చెందిన పాన్ షాపులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు షాపులో తనిఖీ చేయగా.. రూ.10,900 విలువైన గుట్కా ప్యాకెట్లు లభించినట్లు పేర్కొన్నారు. గుట్కా సీజ్ చేసి ప్రకాశ్‌తోపాటు ఆయనకు గుట్కా సరఫరా చేసిన హసన్ చావూష్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



హరికృష్ణ మృతదేహం

దండేపల్లి:మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన బోడకుంట హరికృష్ణ(22) క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. కారుడ్రైవర్‌గా పనిచేసిన హరికృష్ణ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తాగితే పెళ్లి కాదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది ఈనెల 6న దండేపల్లి సమీపంలో క్రిమిసంహారక మందు తా గాడు. ఈ విషయాన్ని స్నేహితుడికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో అతను కుటుంబ స భ్యులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని లక్సెట్టిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

వేలానికి వ్యతిరేకంగా దీక్షలు

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు ప్రారంభం
- నేరుగా సింగరేణి సంస్థకే గనులు కేటాయించాలని డిమాండ్



శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్:తెలంగాణలోని నూతన బొగ్గు గనులను వేలం వేయడాన్ని నిరసిస్తూ సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ముందు చేపట్టిన దీక్షలను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేని శంకర్ ప్రారంభించారు. ఈ దీక్షల్లో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలను సింగరేణి సంస్థకే కేటాయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు గనులను వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. వేలానికి వ్యతిరేకంగా ఈ నెల 13 వరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని వివరించారు. తెలంగాణకు చెందిన కిషన్ రెడ్డి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్నందున సింగరేణిపై సానుకూలంగా వ్యవహరించాలన్నారు. గతంలో ఒడిశా, గుజరాత్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వ రంగ సంస్థలకు నామినేషన్ పద్ధతిలో బొగ్గు గనులను కేటాయించారన్నారు. అదే తరహాలో తెలంగాణలో కూడా గనులు కేటాయించాలని కోరారు. లేని పక్షంలో భవిష్యత్తులో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, బ్రాంచి సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, ఫిట్ కార్యదర్శులు దాడి రాజయ్య, సదానందం, సత్యనారాయణ, కామెర వేణు, నాయకులు మిర్యాల రాజేశ్వరరావు, సంపత్, మారుపెల్లి బాబు, కారుకూరి నగేశ్, లింగం రవి, మొగిలి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రిరూరల్: తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట నాయకులు దీక్ష చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ దీక్షను ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పేరిట తెలంగాణలోని నూతన గనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని చూస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు మల్లేశ్, లింగయ్య, సుదర్శన్, శ్రీనివాస్, రాజేశం, చిప్ప నర్సయ్య, మనోహర్, సత్యనారాయణ, బానయ్య, తిరుపతి పాల్గొన్నారు.

బొగ్గుబావులు దక్కేవరకూ పోరాడుదాం

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రంలోని బొగ్గు బావులు సింగరేణి సంస్థకు దక్కే వరకు పోరాడుదామని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి పిలుపునిచ్చారు. బొగ్గు బ్లాకులను నామినేషన్ పద్ధతిలో సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ చేపడుతున్న దశలవారీ ఆందోళనల్లో భాగంగా సోమవారం గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ వేగంగా బొగ్గు బ్లాకులను వేలం వేయాలని చూస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపి, రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించని పక్షంతో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. దేశవ్యాప్త బొగ్గు గనుల సమ్మెకు కూడా వెనుకాడమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, సీపీఐ మండల కార్యదర్శి జగ్గయ్య, జిల్లా వ్యవసాయ కార్యదర్శి నర్సయ్య, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, రాజేష్, కిరణ్, దివాకర్, శేషశయన రావు, ఓదెలు, అంజయ్య, రాజయ్య, గోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మందమర్రిరూరల్: దీక్షలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు



గోలేటిలో నినాదాలు చేస్తున్న నాయకులు

సౌదీలో దండేపల్లి వాసి మృతి



మరణ వార్త తెలియడంతో విషాదంలో కుటుంబ సభ్యులు..

- ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలింపు..
- చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్
- అవయవదానంతో నలుగురు విదేశీయులకు పునర్జన్మ

దండేపల్లి:ఉపాధి నిమిత్తం సౌదీ వెళ్లిన దండేపల్లి మండలం పాత మామిడిపల్లికి చెందిన పత్తిపాక వెంకటేశ్(41)ఫిట్స్‌తో అక్కడ మృతిచెందాడు. ఈమేరు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే వెంకటేశ్ ఉపాధి నిమిత్తం గతేడాది జూన్ 21న సౌదీ వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న అతనికి ఈనెల 3న ఫిట్స్ రావడంతో తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే కోమాలోకి వెళ్లినట్లు తెలిపారు. వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం అర్ధరాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేశ్ మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అతడికి భార్య సరిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వెంకటేశ్ మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తెప్పించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బంధువులు కలిసి కోరారు.



మృతుడు వెంకటేశ్(ఫైల్)

గొప్పమనసు చాటుకున్న బాధిత కుటుంబం..

ఇదిలా ఉండగా వెంకటేశ్ కుటుంబం పెట్టెడు దుఃఖంలోనూ గొప్ప మనసు చాటుకుంది. దుబయ్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందడంతో అక్కడి ఆస్పత్రిలోని అవయవదాన ట్రస్టు సభ్యులు, వైద్యులు వెంకటేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అవయవదానం చేస్తే నలుగురికి కొత్త జీవితం ప్రసాదించినట్లు అవుతుందని తెలిపారు. వారి విజ్ఞప్తి మేరకు వెంకటేశ్ కళ్లు, కిడ్నీలు దానం చేసేందుకు వెంకటేశ్ భార్య సరిత అనుమతి ఇచ్చింది. మరణించిన వెంకటేశ్ మరో అవయవదానం తో మరో నలుగురికి పునర్జన్మ ప్రసాదించాడు.

రెడ్, ఎల్లో కార్డ్ ఉత్తర్వులు రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

బెల్లంపల్లి:కార్మికులపై క్రమశిక్షణ చర్యల కోసం సింగరేణి యాజమాన్యం రెడ్, ఎల్లో కార్డులు జారీ చేసేలా తెచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఉత్తర్వులకు వ్యతిరేకంగా మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కార్మికులను ఇబ్బంది, భయభ్రాంతులకు గురిచేసే సర్క్యులర్లను వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. ఏ సంస్థలో లేని విధంగా సింగరేణి యాజమాన్యం ఎల్లో , రెడ్‌కార్డ్ సర్క్యులర్లను తీసుకు రావడం కార్మిక వ్యతిరేకమైనదిగా పేర్కొన్నారు. సర్క్యులర్లు రద్దు చేసుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ శాంతిఖని గని ఫిట్ సెక్రెటరీ దాసరి తిరుపతిగౌడ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ మంతెన రమేశ్, ఉపాధ్యక్షుడు బుర్క ప్రశాంత్, నాయకులు మిట్టపల్లి రమేశ్, వెంకటయ్య, సురేశ్, రమేశ్, ప్రవీణ్, రామకృష్ణ, గణేశ్, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

శ్రీరాంపూర్: కాలనీ వాసులకు పరిశుద్ధమైన తాగునీటిని అందించేందుకు నస్పూర్ షిర్కే చౌరస్తాలో సింగరేణి యాజమాన్యం రూ.10 లక్షతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ మూడు నెలలుగా పనిచేయలేదు. దీనిపై 'ఆర్వో వాటర్ ప్లాంట్‌కు మోక్షమెప్పుడో' శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 3న కథనం ప్రచురితమైంది. దీనికి సింగరేణి అధికారులు స్పందించారు. జీఎం సంజీవరెడ్డి సంబంధిత సివిల్ అధికారులతో మరుసటి రోజే చర్చించారు. జాప్యంపై ఆరా తీసి వెంటనే ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని సివిల్ అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం జీఎం ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ వర్షాకాలంలో సీజన్ వ్యాధులకు కలుషిత నీరు కూడా ఓ కారణమన్నారు. శుద్ధమైన నీటిని తాగాలని సూచించారు. వాటర్ ప్లాంట్ ప్రారంభించేలా కృషి చేసిన 'సాక్షి'కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి కొమురయ్య, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం ఏవీ.రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం అరవిందరావు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చారిజ డీజీఎం సివిల్ రాము, ఈఈ సత్యనారాయణ, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హనుమాన్‌గౌడ్, సీనియర్ పీఓ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



నస్పూర్ షిర్కే చౌరస్తాలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి


అనేవారు లేరని.. వినేవారూ లేరు..



ఖాళీ కుర్చీలు.. వచ్చిన ఆ కొందరు అధికారులు సెల్‌ఫోన్‌లో లీనం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉన్నతాధికారులు గోడు వెల్లబోసుకుంటేనైనా సమస్యకు పరిష్కారం దొరుకుతుందని జిల్లా నలుమూలల నుంచి బాధితులు ప్రతీవారం కలెక్టరేట్‌కు వస్తున్నారు. సోమవారం కలెక్టర్ ఇతర విధుల్లో భాగంగా ప్రజావాణికి రాలేదు. దీంతో అదనపు కలెక్టర్ మోతిలాల్ 12 గంటల వరకు అర్జీలు స్వీకరించి ఇతర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లారు. దీంతో వివిధ శాఖల అధికారులు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఉన్నవారు సెల్‌ఫోన్లలో కాలక్షేపం చేస్తూ కనిపించారు. దీంతో ప్రజావాణికి వచ్చిన వారు తమ గడు ఎవరూ పట్టించుకోవడం లేదని చర్చించుకున్నారు.

ప్రశాంతంగా టీజీ ఎఫ్‌సెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టీజీ ఎఫ్‌సెట్-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. కౌన్సెలింగ్ ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగింది. మొత్తం 430మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్ రెడ్డి తెలిపారు.

పోరుబాట కరపత్రాలు ఆవిష్కరణ

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే పోరుబాట ఈ నెల 19, 20 తేదీలలో నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్ తెలిపారు. బీసీల డిమాండ్ల సాధనకు మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి లక్సెట్టిపేట ఉత్కూరు చౌరస్తా వరకు జరిగే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా పోరుబాట కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు కర్రె లచ్చన్న, జైపాల్ సింగ్, శ్రీపతి రాములు, శాఖాపురం భీంసేన్, భిక్షపతి, వేణుగోపాల్, చంద్రమౌళి, బండ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

నాన్ బెయిలబుల్ వారెంట్‌పై ఇద్దరి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు

మంచిర్యాలక్రైం: వరకట్నం వేధింపుల కేసుల్లో కోర్టు విధించిన వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని నాన్ బెయిలబుల్ వారెంట్(ఎన్‌బీడబ్ల్యూ)పై అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కె.నరేశ్‌కుమార్ సోమవారం తెలిపారు. హైదరాబాద్ ఘట్‌కేసర్‌కు చెందిన గుడి మోజేష్‌తో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన పల్లె రామస్వామి-నాగమ్మ దంపతుల కూతురు సరితతో 2005లో వివాహం జరిపించారు. వివాహ సమయంలో సరిత తల్లిదండ్రులు రూ.3 లక్షలు నగదు, 9 తులాల బంగారు ఆభరణాలు కట్నంగా ఇచ్చారు. కొంత కాలం వీరి దాంపత్య జీవితం బాగానే సాగింది. ఈ క్రమంలో కూతురు, కుమారుడు జన్మించారు. తర్వాత సరిత, మోజేష్ మధ్య గొడవలు మొదలయ్యాయి. మోజేష్‌తోపాటు అతని అన్న సాల్మాన్‌రాజ్, వదిన ఏస్తేరు, తమ్ముళ్లు ఫిలిప్, కృపానందం సరితను అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించారు. బాధితురాలు 2019లో ఫిర్యాదు చేయగా మోజేష్, సాల్మాన్‌రాజు, ఏస్తేరు, ఫిలిప్, కృపానాంద్‌పై వరకట్నం వేధింపుల కేసు నమోదైంది. నిందితులు కోర్టు విధించిన వాయిదాలకు హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి కె.నిరోష నలుగురిపై ఎన్‌బీడబ్ల్యూ వారెంట్ జారీ చేశారు. దీంతో మహిళా పోలీస్ స్టేషన్ ప్రత్యే సిబ్బంది వి.రాజేశ్, ఎంఏ.నిసార్ అహ్మద్, జి.రామేశ్వర్‌రావు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం కృపానందం, ఫిలిప్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో లక్సెట్టిపేట జైలుకు తరలించారు. సాల్మాన్‌రాజ్, ఏస్తేరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

శ్రీరాంపూర్: యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఆర్కే 5 గనిలో నూతనంగా 2 ఎస్‌డీయల్ యంత్రాలను ప్రవేశపెట్టారు. జీఎం వాటిని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తిలో ఎస్‌డీయల్ యంత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అనుకున్న ఉత్పత్తి లక్ష్యాలను వీటి ద్వారానే సాధిస్తున్నామన్నారు. యంత్రాలకు ఎప్పటికప్పుడు మెయింటనెన్స్ చేస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి కొమురయ్య, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం ఏవీ.రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం అరవిందరావు, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్, రక్షణాధికారి శివయ్య, ఫిట్ ఇంజినీర్ రాధాకృష్ణ, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, ఫిట్ సెక్రెటరీ నర్సింగరావు పాల్గొన్నారు.



యంత్రాలు ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

గంజాయి క్రయవిక్రయాల కేసులో నిందితుల అరెస్టు

బెల్లంపల్లి: నిషేధిత గంజాయిని అక్రమంగా అమ్మకం, కొనుగోలు చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన చేపట్టిన వాహనాల తనిఖీలో మందమర్రికి చెందిన రవితేజ అనే యువకుడు పట్టుబడగా అతడి వద్ద నుంచి 2కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ కేసులో భాగస్వామి అయిన మందమర్రికి చెందిన మరో నిందితుడు మక్కల గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. తమకు మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన విశ్వదేవ్ మిస్త్రీ అనే వ్యక్తి గంజాయిని అమ్మాడని చెప్పడంతో చంద్రపూర్‌కు వెళ్లి నిందితుడు విశ్వదేవ్ మిస్త్రీని అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ మేరకు ఇద్దరు నిందితుల వద్ద నుంచి 50గ్రాముల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు పంపామని వెల్లడించారు. సమావేశంలో టూటౌన్ ఎస్సై డి.రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్సైలు

మహిళా న్యాయవాదిపై దాడి?

- సోషల్ మీడియాలో వీడియో వైరల్

బెల్లంపల్లి: భర్త ఉండి తప్పుడు సమాచారంతో ఒంటరి మహిళ పింఛన్ పొందుతూ ప్రభుత్వాన్ని మోసగిస్తోందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకు తనపై ఓ మహిళ దాడి చేసిందని బెల్లంపల్లికి చెందిన ఓ మహిళ న్యాయవాది వీడియో విడుదల చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిప్పరి విక్టోరియా అనే మహిళ బెల్లంపల్లిలోని రడగంబాల బస్తీలో భర్త కరుణాకర్, పిల్లలతో నివాసం ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఒంటరి మహిళ పింఛన్ తీసుకుంటుంది. ఈ మేరకు న్యాయవాది గాదవేణ మమత ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ విషయంపై మాట్లాడుకుందామని రడగంబాల బస్తీలో ఉన్న హనుమాన్ ఆలయం వద్దకు రావాలని మమతకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు వెళ్లిన తనపై మెప్మా ఆర్పీల సమక్షంతో విక్టోరియా, ఆమె కూతురు నందిని దాడి చేశారని, విక్టోరియా భర్త కరుణాకర్ తీవ్రంగా దూషించాడని మమత వీడియోలో ఆరోపించారు. తాను గర్భిణి అని కూడా చూడకుండా భౌతికంగా దాడి చేశారని కన్నీరు పెట్టుకుంది. ఎమ్మెల్యే పీఏ ప్రసాద్ అండతో తనపై దాడిచేశారని తెలిపింది. ఈ ఘటనను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొంది. ఇదిలా ఉంటే.. ఓ పొదుపు సంఘంలో నిధుల దుర్వినియోగం జరగడంతో మమత తల్లి, ఆడబిడ్డపై ఏడాదిక్రితం చీటింగ్ కేసు నమోదు చేశామని టూటౌన్ ఎస్సై రమేశ్ తెలిపారు. ఈ విషయంలో కాంప్రమైజ్ కావాలని విక్టోరియాపై న్యాయవాది మమత ఒత్తిడి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం మాట్లాడుకునే క్రమంలో మాటామట పెరిగి వీడియో తీస్తున్న బాలికపై మమత చేయిచేసుకుందని చెప్పారు. దీతో విక్టోరియా, మమత పరస్పరం కొట్టుకున్నారని తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఇందారం ట్రాక్టర్ యజమానులపై ఫిర్యాదు

జైపూర్: మండలం ఇందారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులపై అదే గ్రామానికి చెందిన పలువురు యువకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందారం సమీపంలో గల గోదావరి నది నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్ల ఫొటోలు, వీడియోలను గ్రూపుల్లో పోస్టులు చేయగా ..పోస్టులు చేసిన యువకులపై, వారి ఇంటిపై దాడికి పాల్పడ్డారని యజమానులపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు. ఇందారం సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన రెండు ఇసుక డంపులను పోలీసులు సీజ్ చేసినట్లుగా తెలిసింది.

చిత్రం గీసి.. అభిమానం చాటి

తలమడుగు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రాన్ని గీసి తన అభిమానాన్ని చాటాడు తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన గట్టు రాజు. వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆ మహానేతపై ఉన్న అభిమానంతో పెన్సిల్‌తో చిత్రాన్ని గీసినట్లు చిత్రకారుడు రాజు తెలిపాడు.

